విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 23, ఫిబ్రవరి 2023

ఉద్యమ నాయకులను ఎన్నుకోండి

విశాలాంధ్ర -వెలుగోడు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు గెలుపుకై ప్రజా సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రామదాసు, మండల అధ్యక్షుడు వాదం.నాగమోహన్ అలాగే నాయకులు కరిముల్లా, నబి రసూల్ డాక్టర్ పోతుల నాగరాజు గారి గెలుపుకై బోయ రేవుల,మోత్కూరు,మాధవరం, అయ్యవారిపల్లె, తిమ్మనపల్లె గ్రామాలలోని సచివాలయాలు ,పాఠశాలలు , హాస్పిటల్లో, అంగన్వాడి సెంటర్లలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ శాసనమండలిలో ప్రజల కోసం, ప్రజల సమస్యల కోసంమాట్లాడే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి గెలిపించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాతసంవత్సరానికి రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఆ ఉద్యోగాలు ఇవ్వకపోగా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ వాటిలో పనిచేసే ఉద్యోగస్తులను కార్మికులను తీసేయడం జరుగుతుందన్నారు. మన రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వము ఉద్యోగులపైన, కార్మికుల పైన, కర్షకుల పైన వారి పౌర హక్కుల కోసం పోరాటాలు చేయకుండా ఉండడానికి జీవో నెంబర్ ఒకటిని తెచ్చిందన్నారు. కావున కేంద్రంలో రాష్ట్రంలో ప్రజల కోసం పనిచేసే పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి గెలిపించాలన్నారు.

ఫిట్నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి

విశాలాంధ్ర-నందికొట్కూరు : పట్టణంలో ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతున్న నారాయణ పాఠశాల పై చర్యలు తీసుకోని ఆ బస్సులను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షులు వీరేంద్ర బుధవారం డిప్యూటీ ఎమ్మార్వో కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణ పాఠశాల యాజమాన్యం స్కూల్ ఫీజు వ్యాన్ ఫీజు అంటూ వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రక్తం పీల్చే జలగల్లాగా వసూలు చేస్తున్నారన్నారు. కనీసం ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు .విద్యార్థులు ఉదయము 7: 30 నిమిషాలకు వస్తే స్కూలుకు వచ్చేసరికి దాదాపు 10:30 అవుతుంది పాఠశాలకు రావాలన్న అలాగే తిరిగి ఇంటికి వెళ్లాలన్న ఎప్పుడు ఇంటికి చేరుకుంటామో అని అయోమయంలో విద్యార్థులు ఉన్నారన్నారు. ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులను ఆర్టిఎ అధికారులు సీజ్ చేయాలని వారు అన్నారు లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలకు సిద్ధమవుతామని వారు పిలుపునిచ్చారు. తాలూకా ఆర్గనైజింగ్ కార్యదర్శి దినేష్ ,వినోదు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పరిణామాలపై విచారణ చేయండి

విశాలాంధ్ర-నందికొట్కూరు : నందికొట్కూరు మున్సిపాలిటీలో జరుగుతున్న పరిణామాలపై తక్షణమే విచారణ చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ఆత్మహత్యాయత్నంపై సమగ్ర విచారణ జరిపి అవినీతి అక్రమాలకు తావు లేకుండా అవినీతికి పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా అధ్యక్షులు వి.రఘురాంమూర్తి,రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు , అనంతపురం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్ బుధవారం అనంతపురం లోని మున్సిపల్ ప్రాంతీయ సంచాలకులు అప్పిలెట్ కమిషనర్ పివివిఎస్. మూర్తికి ఆయన ఛాంబర్‌లో కలిసి మాట్లాడి వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అనేక రోజుల నుండి నందికొట్కూరు మున్సిపాలిటీలోని శానిటరీ ఇన్స్పెక్టర్ బాధ్యతల విషయంలో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. ప్రజల సమస్యలు పట్టించుకోకుండా అధికారుల మధ్య కొమ్ములాటలు, అవినీతి ఆరోపణలు ఎక్కువయ్యాయి అన్నారు.తక్షణమే మున్సిపాలిటీ లో ఉన్న అధికారుల పనితీరు,బిల్లుల విషయం తదితర విషయాలపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఆర్డీ వివరణ. నందికొట్కూరు మున్సిపాలిటీలో జరుగుతున్న పరిణామాలు నా దృష్టికి కూడా వచ్చాయని ఈ విషయాలపై తక్షణమే సీనియర్ అధికారి చే దర్యాప్తు చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారనారు. వీరితోపాటు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పార్టీ క్యాడర్ పై తప్పుడు ఆరోపణలు

విశాలాంధ్ర -ఆత్మకూరు టౌన్: వైసీపీ పార్టీ బలంగా ఉండడంతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని శ్రీశైలం నియోజకవర్గం వైసీపీ నియోజకవర్గం సమన్వయ కర్త శిల్పా భువనేశ్వర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండడం జీర్ణించుకోలేక తప్పుడు మెసేజ్ లతో, నిరాధార మెసేజ్లతో ,ఇటు పార్టీ క్యాడర్ పై అటు పార్టీపై తప్పుడు ఆరోపణలు సృష్టించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని, పార్టీ క్యాడర్ ను నష్టపరిచి విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. మీరు చేస్తున్న ఆరోపణలకు ఎటువంటి ఆధారాలు ఉన్నా తీసుకొని రావాలన్నారు. ఇలా దొంగచాటుగా తప్పుడు మెసేజ్లు పెట్టి, సమాజంలో, ప్రజలలో ఇటు పార్టీ నాయకులపై అటు పార్టీపై తప్పుడు సాంకేతాలు పంపి నష్ట పరిచాలని ప్రయత్నిస్తే ఇకముందు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంజాద్ అలీ, ఎంపీపీ తిరుపాలమ్మ, జడ్ పి టీ సి శంకర్ రెడ్డి, వైసీపీ నాయకులు రాజా మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు జెడ్పిటిసి,తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మండలంలోని అధికారులు సమన్వయంతో

గ్రామాలలో సమస్యలను పరిష్కరించాలని ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపిడివో కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ హరినాథ్ రావు, ఎంపిడివో సుబ్బారెడ్డి, వివిధ శాఖల అధికారులు మండలంలోని గ్రామాలలో తమ శాఖలకు సంబంధించి జరుగుతున్న పనుల గురించి వివరించారు. చివరగా ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందువల్ల ఎలాంటి తీర్మానాలు చేయకూడదన్నారు. తాను ప్రతి సమావేశంలో విధిగా చెప్పడం జరుగుతుందని మండల సమావేశాలకు హాజరయ్యే ప్రతి అధికారి పూర్తి సమాచారంతో రావాలన్నారు. మండల సమావేశంలో గ్రామాలలో నెలకొని ఉన్న సమస్యలను చర్చించడం జరుగుతుందన్నారు. మండల సభ దృష్టికి సమస్యను తీసుకొని వస్తే వాటికి పరిష్కార మార్గాలు లభిస్తాయన్నారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షులు నాసారి ప్రసాద్, వ్యవసాయ అధికారి కిషోర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణ నాయక్, మండల విద్యాధికారి శోభా వివేకవతి, హౌసింగ్ ఏఈ నరసింహ తో పాటు సర్పంచులు, ఎంపీటీసీ లు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తాం

విశాలాంధ్ర - డోన్ రూరల్ : అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తామని టౌన్ సిఐ పెనుగొండ శేషయ్య అన్నారు. స్థానిక పోలీస్ కార్యాలయంలో శేషయ్య మీడియాతో మాట్లాడుతూ అ సాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. ముఖ్యంగా పట్టణంలో ఇతర రాష్ట్రాల మద్యం, మట్కా జూదం, సెల్ ఫోన్ దొంగతనాలు ఎక్కువగా ఉండడమే కాకుండా ఆకతాయిలు అల్లరి మూకలు ఇష్టారాజ్యాంగా ప్రవర్తిస్తున్నారని అటువంటి వారు తీవ్ర పరిమాణాలు ఎదుర్కోవాల్సి వస్తుందని,శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి భరతం పడతామనిశేషయ్య హెచ్చరించారు.

పాడి రైతులకు చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర -అవుకు : మండలంలోని కొండమనాయన పల్లి, పిక్కిళ్లపల్లి

తండా, మారేమడుగుల గ్రామాలకు చెందిన పాడి రైతులకు బోనస్ చెక్కులను డైరీ డిప్యూటీ డైరెక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022వ సంవత్సరం జనవరి నుండి డిసెంబర్ వరకు నాలుగు జిల్లాలలో పాడి రైతులకు ఐదు కోట్ల రూపాయల మేర బోనస్ను అందించినట్లు తెలిపారు. అందులో భాగంగా కొండమనాయునిపల్లి, పిక్కిళ్లపల్లి తాండ, మారేమడుగుల గ్రామాలకు సంబంధించి ఒక కోటి 50 లక్షల 425 లీటర్ల పాలన సేకరించామని అందుకుగాను ఒక లీటరుకు ఒక్క రూపాయి 40 పైసల ప్రకారంగా రెండు లక్షల పదివేల రూపాయలను బోనస్గా అందించామని అన్నారు. గ్రామ పెద్దలు కడింటి వాసు, ఎల్లాల వాసు మేనేజర్ నాగరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వెనుకభాగంలో ఉసేన్‌వలీ అనే రైతుకు చెందిన గడ్డివాము ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. స్థానిక కాలనీలో బుధవారం మధ్యాహ్నం రైతు గడ్డివాము దగ్గరికి పశుగ్రాసానికి వెళ్లగా దగ్ధమౌతూ ఉండడాన్ని గమనించి కేకలు చేశారు. స్థానికులు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఆళ్లగడ్డ అగ్నిమాపక దళం వచ్చి మంటలను అదుపు చేశారు. పాడి రైతుకు రూ. లక్ష మేర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా భానుముక్కల పెద్దమ్మ దేవర

విశాలాంధ్ర-బనగానపల్లి: బనగానపల్లె (భానుముక్కల) పెద్దమ్మ దేవర బుధవారం నాడు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు జంతు బలులు ఇచ్చి బోనాలు పెద్దమ్మ తల్లికి సమర్పించి ముక్కులు తీర్చుకోవడం జరిగింది. 10 సంవత్సరాల తర్వాత పెద్దమ్మ జాతర జరుగుతుండడంతో ప్రజల బంధువులతో సన్నిహితులతో గ్రామంలోని ప్రతి ఇంట్లో సందడి వాతావరణం కనిపించింది. గ్రామంలోని ప్రజల పిలుపు మేరకు బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పెద్దమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామంలోని ప్రజల పిలుపుమేరకు ఆయా నివాసాల వద్దకు వెళ్లి వారి ఆతిథ్యం స్వీకరించడం జరిగింది. డోన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు ఎస్సై రామిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

బీసీలకు పెద్దపీట

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బిసిలకు సముచిత స్థానం కల్పించి పెద్దపీట వేయడం జరిగిందని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడచిన ప్రభుత్వాలు బిసిలకు అన్నింటా మొండిచేయి చూపడం జరిగిందన్నారు. శాసనమండలిలో 69 శాతం సీట్లను బిసి, ఎస్సీ ఎస్టీ మైనార్టీలకే కేటాయించామన్నారు. కొన్ని పార్టీలు వీరిని ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తుండగా తమ పార్టీ మాత్రం వీరిని సమాజానికి వెన్నుముకగా భావిస్తుందన్నారు. అటు అభివృద్ధి ఇటు అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ తమ పార్టీ ముందుకు సాగుతుందన్నారు. 18 ఎమ్మెల్సీ నియామకల్లో అత్యధికంగా బిసిలకు పెద్ద పీట వేసి సామాజిక న్యాయం వైపు అడుగులు వేసిన ముఖ్యమంత్రి జగన్‌కు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలుతెలియజేస్తున్నామన్నారు.ప్రతి విషయంలో పరిపాలనలో సామాజికంగా దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అన్ని వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న జగన్ ను 2024 లో కూడా ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల కోడ్ తొలగించగానే ఆళ్లగడ్డలో నూతన ఆసుపత్రిని ప్రారంభిస్తామన్నార అంతే గాక మరో ఎనిమిది కోట్లతో ఆస్పత్రి రెండవ దశ పనులు చేపట్టబోతున్నామన్నారు. రహదారులు లేని గ్రామాలకు కొత్త రహదారులు వేసిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు గజ్జల రాఘవేంద్ర రెడ్డి, రమేష్ గౌడ్,మాదం చెన్నయ్య పాల్గొన్నారు.

సర్పంచ్ చెక్ పవర్ తొలగించాలి

- కేసు కట్టకుండా కాలయాపన చేస్తున్న ఎస్ఐ
- సర్పంచు నుండి నాకు ప్రాణ హాని ఉంది
- వెంకటేశ్వర్లు పై దాడి హేయమైన చర్య
- సర్పంచ్ పై వడ్డెర సంఘం నాయకులు ఆగ్రహం

విశాలాంధ్ర - మిడుతూరు : పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ పి.చంద్రశేఖర్ రెడ్డి చెక్ పవర్ రద్దుచేసి సర్పంచ్ పదవి నుండి వెంటనే తొలగించాలని వడ్డెర సంఘం జిల్లా నాయకులు చక్రి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన మిడుతూర్ లో స్థానిక జయరాముడు బండల డిపోలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై వెళ్తున్న సర్పంచుకు సైడ్ ఇవ్వలేదని నెపంతో పాత కక్షలు మనసులో పెట్టుకొని మట్టి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పై సర్పంచు నానా దుర్భాషలాడుతూ అసభ్య పదజాలంతో మాట్లాడుతూ అతనిపై చెప్పుతో చేయి చేసుకోవడం సమంజసం కాదని ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్న సర్పంచ్ పై పోలీసులు అధికారులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయాలని స్థానిక ఎంపీడీవో, తహశీల్దార్ ను కలసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. స్థానిక ఎస్ఐ సర్పంచ్ పై కేసు పెట్టకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. సర్పంచ్ పైన చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకోలు చేపడతామని తెలిపారు. రాత్రి సమయంలో గ్రామ సర్పంచ్ అతనితోపాటు 40 మంది అనుచరులతో వెంకటేశ్వర్లు ఇంటిపై ముకుమ్మడిగా దాడి చేసేందుకు ప్రయత్నించారన్నారు. అనంతరం బాధితుడు మట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేను ఇల్లు నిర్మిస్తుంటే నీళ్లు పట్టుకునేందుకు వెళ్లగా నీళ్లు ఎవరిని అడిగి పట్టుకున్నారా నన్ను అడిగి పట్టుకోవాలంటూ గతంలో తనపై దాడి చేశారని గుర్తు చేశారు. ఏది ఏమైనా గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి నుండి తనకు ప్రాణ హాని ఉందని జిల్లా ఎస్పీ తనకు న్యాయం చేయాలని విలేకరుల ముందు వాపోయారు.

ఎమ్మెల్యే సహకారంతో పట్టణాభివృద్ధి

విశాలాంధ్ర-నందికొట్కూరు : నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్థర్ సహకారంతో నందికొట్కూరు పట్టణ అభివృద్ధికి బాటలు వేయడం జరుగుతుందని పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని, రెండవ వార్డ్ కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుస్సేన్ అన్నారు. బుధవారం స్థానిక 25వ వార్డులో విద్యుత్ తీగలు మనుషులకు ప్రమాదంగా క్రిందికి వేలాడుతుండడంతో వార్డు ప్రజలు పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోకపోవడంతో ఈ విషయంపై వార్డు కౌన్సిలర్ కు తెలియజేయడం జరిగింది. దీంతో కౌన్సిలర్ స్థానిక ఎమ్మెల్యే ఆర్థర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి ఆ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించడంతో విద్యుత్ ఏడి, ఏ ఈ తన సిబ్బందితో 25వ వార్డులో క్రిందికి ఉన్న విద్యుత్ తీగలను పైకి లాగించి ప్రజలకు అపాయం లేకుండా సమస్యను పరిష్కరించడం జరిగింది. వార్డు ప్రజలు స్థానిక వార్డు కౌన్సిలర్ మొల్ల రబ్బాని,జాకీర్ హుస్సేన్ లను అభినందించారు. వైస్ చైర్మన్ మొల్లరబ్బాని మాట్లాడుతూ 25వ వార్డులోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు వార్డు కౌన్సిలర్ గా నా వంతు సహాయం కచ్చితంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే ఆర్థర్ సహకారంతో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ఎల్లవేళలా వెన్నంటి ఉంటానన్నారు. సమస్యను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే త్వరితగతిన పరిష్కరిస్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో రియాజ్(హండి), చంద్ బాషా,వసుల శ్రీనివాసులు నాయుడు(వైస్సార్సీపీ సోషల్ మీడియా కో-కన్వీనర్)అబ్బాస్, ఆఫ్రిద్ వార్డ్ ప్రజలు పాల్గన్నారు.

టీజీ సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-బనగానపల్లి : మాజీ రాజ్యసభ సభ్యులు పారిశ్రామికవేత్త టీజీ

వెంకటేష్ సేవలు మరవరానివని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య పేర్కొన్నారు. బుధవారం టిజీ వెంకటేష్ వివాహ వేడుకల సందర్భంగా బనగానపల్లె పట్టణంలోని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో అమ్మవారి శాలలో ప్రత్యేక పూజలు చేసి విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన ప్యాడు రెండు పెన్నులు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా టంగుటూరి శీనయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపార రంగం తో పాటు రాజకీయంగా కూడా అభివృద్ధి చెందాలని ప్రజలకు మరింత సేవ చేసేందుకు ఆర్యవైశ్యులు తోడ్పాటు అందించాలని టంగుటూరి శీనయ్య ఆకాంక్షించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు నాగేంద్ర, ప్రపంచ ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ భరతుడు, నల్లగట్ల వెంకటేశ్వర్లు ,నల్లగట్ల శివయ్య, జిల్లా అధ్యక్షురాలు ఆర్యవైశ్య సంఘం బండారు లలిత, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షురాలు నూకల వాసంతి, కాసుల జంగం శెట్టి, మాజీ సింగల్ విండో చైర్మన్ మల్లారెడ్డి, నాగేష్, పాల్గొన్నారు.

ఎలక్ట్రోల్స్ జాబితాపై సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : మండల పరిధిలో ఖాళీ ఏర్పడ్డ కనకాద్రి పల్లి సర్పంచ్, తుమ్మలపెంట ఎంపీటీసీ, బెలుం,అంకిరెడ్డిపల్లి లోని రెండు వార్డు మెంబర్లకు సంబంధించిన ఎలక్ట్రోల్స్ తయారీపై ఎంపిడిఓ సుబ్బరాజు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ఆయన పలు అంశాలపైఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు.సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్,ఏపీ సేవా సర్వీసులు,ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు, 28వ తేదీన జరగబోయే మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు, గ్రామాలలో తాగునీటి సమస్యలు లేకుండా తీసుకోవలసిన చర్యలు, ఆయా గ్రామాలలో ఇంటి పనులు వసూలు చేయుట తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఈవో ఆర్ డి తాహెర్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, రాఘవరెడ్డి, భార్గవిలత, అమరావతి, బోయాజ్, పర్వేజ్, ఖాసీం, రాజశేఖర్ రెడ్డి,ఉదయ్ కుమార్, కృష్ణవేణి, కవిత,శివకుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఆటో - కారు ఢీ

విశాలాంధ్ర -బనగానపల్లి : మండల పరిధిలోని క్రైప గ్రామానికి చెందిన కూలీల ఆటో ఉదయం తిమ్మాపురానికి కూలీ పనులకు వెళ్తూ పండ్లపురం నందవరం గ్రామం మధ్యలో కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఆటోలోని ఏడుగురు తీవ్రంగా గాయపడడం జరిగింది. క్షతగాతులను మెరుగైన వైద్యం కోసం నంద్యాల శాంతిరం ఆస్పత్రికి తరలించడం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

సర్వే వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకై చేపట్టిన సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వివిధ శాఖల అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని అధిగమించడం, అంగన్వాడి కేంద్రాల్లో బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి ఎదుగుదలకు ప్రతిష్ట ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, మహిళా పోలీసులు, అంగన్ వాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు సమిష్టిగా ఏర్పడి సర్వే వంద శాతం మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు దస్తగిరి, కృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ శైలజ, ఏపీఎం శేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టెక్నాలజీని రైతులు ఉపయోగించుకోవాలి

విశాలాంధ్ర -బనగానపల్లి : యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్

సైంటిస్ట్ అండ్ హెడ్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో కొత్తగా డ్రోన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇదివరకే అగ్రికల్చర్ డ్రోన్ ప్రాజెక్టులో భాగంగా బనగానపల్లె, ఆళ్లగడ్డ, రుద్రవరం, నందికొట్కూరు మండలాల్లోని వివిధ గ్రామాలలో దాదాపుగా 1500 ఎకరాలలో చిన్న సన్నకారు రైతుల పొలాల్లో పిచికారీ చేయించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది అని తెలియచేసారు. ప్రస్తుతం కెవికె వారి ఆధ్వర్యంలో కొత్తగా డ్రోన్ ను క్రిమిసంహారక మందుల పిచికారికి అందుబాటులో ఉంచడం జరిగినది. కావున దీనిని విస్తృతంగా వినియోగించుకోవలసినదిగా రైతులను కోరడమైనది. ఎస్ హెచ్ ఈం సిఎస్ఏఓ కుమార్, శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవి గౌడ్ మరియు ఇతర సాంకేతిక సిబ్బంది, రైతులు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర -అవుకు : పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన మంద బాబు (22) అనే యువకుడు మోటార్ సైకిల్ పై వస్తుండగా బుధవారం బస్టాండ్ వద్ద ట్రక్కు లారీ ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి.వెంటనే కుటుంబ సభ్యులు బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు.అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి కేసు నమోదు చేశారు.అజాగ్రత, అతివేగమే ఇందుకు ప్రధాన కారణమని పోలీసులు తెలిపారు.ఇతనికి ఇంకా పెళ్లి కాలేదు.కుటుంబ సభ్యులు శోక సంద్రంలోమునిగి పోయారు.

ఎమ్మెల్సీ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు

విశాలాంధ్ర - నంద్యాల : పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ కత్తి

నరసింహారెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుల నామినేషన్ ర్యాలీలో సీపీఐ నంద్యాల జిల్లా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్. రంగ నాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, నాయకులు ప్రసాద్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు దనుంజయుడు, నాగరాముడు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల సమస్యకు పరిస్కారం

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు పట్టణంలోని ఇందిరా నగర్ లో ఎల్.ఐ. సి ఏజెంట్ ఇంటి వీధిలో మూడేళ్ల క్రితం వేసిన 3 విద్యుత్ స్తంభాలకు కరెంట్ లైన్ వేయక పోవడం తో గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అయినా అధికారులు పట్టించుకోక పోవడంతో 20 తేదీ విశాలాంధ్రలో ఎమ్మెల్యే ఆదేశాలు భేఖాతార్ అనే వార్త ప్రచురితమైంది. ఈ విషయం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి దృష్టికి పోవడంతో విద్యుత్ అధికారి రవీంద్ర నాయక్ ద్వారా స్తంభాలకు కరెంట్ లైన్ వేసి సమస్య ను పరిష్కరించారు. దింతో ఆ కాలనీ వాసులు ఎమ్మెల్యేకు, విద్యుత్ ఏ.ఇ కి, స్థానిక ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ అండతోనే రౌడీ మూకలు

విశాలాంధ్ర - నంద్యాల : లోకేశ్ పాదయాత్రలో ప్రజల ఆదరణ పెరిగే కొలది వైసీపీ నేతలకు జ్వరం పెరిగిపోతోందని టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ పేర్కొన్నారు.జగన్ అరాచక పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించేందుకు నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్ర 300 కిలోమీటర్లు రాష్ట్రంలో ఉన్న ప్రజల నుంచి ఆదరణ పెరిగిపోయిందని, లోకేశ్ ఏ గ్రామానికెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పదుతున్నారని అందుకే పాదయాత్రలో లోకేశ్ నడిచిన కిలోమీటర్లు పెరిగే కొలది, వైసీపీ నేతలకు జ్వరం పెరిగిపోతోందని,ఓటమి భయంతో పోలీసుల్ని అడ్డుపెట్టుకుని పాదయాత్రకు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నారన్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయం పై ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు పట్టపగలే దాడికి పాల్పడ్డారని, కర్రలు,రాళ్లతో దాడి చేస్తుంటే పోలీసులు పేక్షకపాత్ర వహించడం సిగ్గుచేటన్నారు. నాడు మాచర్ల టీడీపీ కార్యాలయంపై దాడి చేసి వారిపై చర్యలు తీసుకుంటే ఈ దాడి జరిగేదా అని ప్రశ్నించారు. 2024లో ప్రజలు వైసీపీని కృష్ణా నదిలో తొక్కి బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

సామాజిక న్యాయం పాటించిన సిఎం

విశాలాంధ్ర - నంద్యాల : ఎమ్మెల్సి పదవుల్లో సిఎం జగన్ సామాజిక న్యాయం

పాటించడం జరిగిందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో మీడియాతో శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. గత టిడిపి ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవులను కేవలం కొన్ని వర్గాలకు మాత్రమే కేటాయించిందని, నేడు వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సామాజిక న్యాయాన్ని తూచా తప్పకుండా పాటించారని, ఇటువంటి ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేరని పేర్కొన్నారు. 14 మంది ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు చెందిన వారికి ఎమ్మెల్సీ పదవులు అందించిన ఘనత జగనన్నదన్నారు.

శాంతిరాం ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - నంద్యాల : ప్రాంగణ ఎంపికల్లో శాంతిరాం ఫార్మసీ కళాశాల

విద్యార్థులు మరోసారి తమ ప్రతిభ చాటుకుంటున్నారు. ఓమేగా హెల్త్ కేర్ సంస్థలలో మెడికల్ కోడర్ లు 55 మంది ఫైనల్ ఇయర్ బి ఫార్మసీ, డి ఫార్మా విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సి. మధుసూదన్ శెట్టి మాట్లాడుతూ సెలెక్ట్ అయిన విద్యార్థులకు సంవత్సరానికి రూ 2.52 లక్షల వేతనం లభిస్తుందన్నారు. శాంతిరాం ఫార్మసీ కళాశాలలోని ప్లేస్ మెంట్ సెల్ ఆధ్వర్యంలో మెడికల్ కోడింగ్ పై శిక్షణ ఇవ్వడం వల్ల సులువుగా ఉద్యోగాలు సాధించారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర -కొలిమిగుండ్ల: మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ట్రాక్టర్ బైకును ఢీకొన్న ప్రమాదంలో బుధవారం ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం జిల్లా కొత్తచెరువుకు చెందిన దంపతులు ప్రతాప్, అంజలీ మోటార్ బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలోని అంకిరెడ్డిపల్లి సమీపంలో ట్రాక్టర్ బైక్ను ఢీకొన్నది. ప్రమాదంలో ప్రతాప్, అంజలీలు తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం ఇరువురిని 108 నందు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చిన్నయ్య తెలిపారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలోని కోటవీధిలో ఉన్నటువంటి స్వాతంత్ర సమరయోధులు, రేనాటి ముద్దుబిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176వ వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి హాజరై మహనీయుని విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, పల్ల సుధాకర్ రెడ్డి, రజిని కుమార్ రెడ్డి, డాక్టర్ పీరం మురళీధర్‌రెడ్డి, సూదిరెడ్డి,శ్రీధర్‌రెడ్డి,అర్జున్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, నరేష్ రెడ్డి, గోవిందారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 23, ఫిబ్రవరి 2023

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

విశాలాంధ్ర - పత్తికొండ : అంగన్వాడి వర్కర్లకు పెండింగ్ లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష ,కార్యదర్శులు నెట్టి కంటయ్య, రంగన్నలు డిమాండ్ చేశారు. బుధవారం ఐసిడిఎస్ సిడిపిఓకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల పై అధికారుల వేధింపులు ఆపాలని, అంగన్వాడీలకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.బడ్జెట్లో నిధుల కేటాయింపులు పెంచి ఐసిడిఎస్‌లను బలోపేతం చేయాలన్నారు.పదవీ విరమణ వయసు 62సంవత్సరాల పెంచి, ఆఖరివేతనంలో 50%పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కా రానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మాదన్న, రాజప్ప, గుండు భాష, రామచంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను, పట్టభద్రులను కొనలేరు

విశాలాంధ్ర - ఆదోని : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో అధికార పార్టీ అభ్యర్థి యం.వి.రామచంద్రారెడ్డి,వెన్నపూస రవీంద్రారెడ్డి గిఫ్ట్ బాక్స్‌లు, తాయిలాలు పంపిణీ చేస్తున్నారని, అధికార బలంతో ఉపాధ్యాయుల,పట్టభద్రుల ఆత్మ గౌరవాన్ని వెలకట్టలేరనీ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ్ విమర్శించారు. బుధవారం ఆదోనిలోని కళాశాలలు,పాఠశాలలు తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార దాహంతో,అధికారమును అడ్డం పెట్టుకొని ఉపాధ్యాయుల,పట్టభద్రుల ఓట్లను కొంటాం, బోగస్ ఓట్లతో గెలుస్తామని విర్రవిగితే తగిన బుద్ధి చెప్పడానికి ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రభుత్వ అభ్యర్థులను ఓడించి గుణపాఠం చెప్పడానికి ఉపాధ్యాయులు , పట్టభద్రులుఅందరూ సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల లో ఉద్యమ నాయకులను, వామపక్ష భావజాల అభ్యర్థులను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.గిఫ్ట్ లు, తాయిలాలు విషయమై త్వరలోనే రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ను కలిసి ఫిర్యాదు చేస్తామని అన్నారు. నెల నెలా ఒకటో తేదీ జీతాలు ఇవ్వలేని,సకాలం లో కరువు భత్యం ఇవ్వలేని,సిపియస్ రద్దు హామీని విస్మరించిన, ఉద్యోగులకు ఉపాధ్యాయుల కు పీఆర్సీ బకాయిలు, జీపీఫ్, జీవిత భీమా సొమ్ములు చెల్లించలేని అధికార అభ్యర్థులు యం.వి.రామచంద్రారెడ్డి,వెన్నపూస రవీంద్రారెడ్డిని చిత్తుగా ఓడించాలని కోరారు. విద్యాశాఖ లో ఉన్నత స్థాయి పదవిలో ఉంటూ అధికార పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఆర్జేడీ ప్రతాప్ రెడ్డి సెలవు రోజులలో, అర్ధరాత్రి వేళ

డిన్నర్లు ఏర్పాటు చేసి ప్రలోభాలకు గురిచేయడం మానుకోవాలని, తక్షణమే ఎన్నికల సంఘం ఆర్జేడీ ప్రతాప్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు కానివారు, ఎన్నారై డాక్టర్లు, వ్యాపారస్తుల కు ఉపాధ్యాయుల,విద్యార్థుల,నిరుద్యోగుల,పాఠశాలల సమస్యల పై ఏమి అవగాహన ఉంటుందని, వీరందరికీ గుణ పాఠం చెప్పే రోజు కోసం ఎదురు చూస్తున్నామని అన్నారు. జాతీయ విద్యా విధానం పేరుతో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు 3,4,5, తరగతుల విలీనం విద్యావ్యవస్థకు గొడ్డలి పెట్టు అని, తక్షణం విరమించుకావాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎస్టీయు మరియు యూటీఎఫ్ సంఘాల ఉమ్మడి అభ్యర్థి కత్తి నరసింహ రెడ్డిని, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గా పోతుల నాగరాజు గారిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దస్తగిరి,శ్రీకృష్ణ దేవరాయలు, అనిల్, కిరణ్, హరి, బన్నీ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా సచివాలయ భవనం

విశాలాంధ్ర-హొళగుంద : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల ముంగిట పరిపాలన అందించడానికి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మండలంలోని మార్లమడికిలో దాదాపు 40 లక్షల రూపాయలతో కొత్త భవనాన్ని నిర్మించి అధికారులు నిర్లక్ష్యంగా వదిలివేశారు. గ్రామ సచివాలయం భవనం నిర్మించినప్పటికీ సచివాలయం సిబ్బంది భవనం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు ప్రారంభోత్సవానికి భవనం సిద్ధంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపించారు.నూతన భవనాన్ని ప్రారంభిస్తే అధికారులు అందుబాటులో ఉండడమే కాక తమకు ఎంతో అనుకూల మవుతుందని ప్రజలు తెలిపారు. నూతన భవనం నిర్మించినప్పటికీ ఎలాంటి రాకపోకలు లేనందున సచివాల యం చుట్టూ అపరిశుభ్రత ఏర్పడి దుర్గంధంగా మారిందని ప్రజలు ఆరో పించారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని నూతన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

వైఎస్ఆర్ భీమా పథకం పేదలకు వరం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : వైఎస్ఆర్ భీమా పథకం పేదలకు వరంలాంటిదని మాజీ ఎంపీటీసీ, గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్న తుంబళం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పింజరి ఖాజాభీ కుటుంబానికి వైఎస్ఆర్ భీమా పథకం కింద తక్షణ సహాయంగా మృతురాలి భర్త పింజరి నబికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలోని యజమాని మరణిస్తే కుటుంబం వీధిన పడకుండా వైఎస్ఆర్ భీమా పథకం ఆదుకొంటుందన్నారు. మృతురాలు ఖాజాభీ కుటుంబానికి మిగిలిన మొత్తాన్ని బ్యాంకు ఖాతాకు జమ అవు తుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ పుణ్యవతి, వాలంటీర్ భాస్కర్ పాల్గొన్నారు.

సిద్ధప్ప గౌడ్ మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర - హొళగుంద : హొళగుందలో బుధవారం అనారోగ్యంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక రైతు సంఘం సీనియర్ నాయకుడు సిద్ధప్ప బసప్ప గౌడ్ మృతి చెందారు సిద్ధప్ప గౌడ్ మరణ వార్త వినగానే సిపిఐ మండల కార్యదర్శి కాలప్పాచారి సిపిఐ మండల సహాయ కార్యదర్శి కే.రంగన్న సిపిఐ నాయకులు మస్తాన్ నూరాల్లా మోనిష్ ఆచారి సిరిగేరి కృష్ణ మృతుడి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు. సిపిఐ మండల కార్యదర్శి కాళ్లప్పాచారి మాట్లాడుతూ సిద్ధ బసప్ప గౌడ్ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక రైతు సంఘం సీనియర్ నాయకుడుగా ఎన్నో పోరాటాలు ఉద్యమాలు చేశాడని గౌడ్ మృతి వల్ల పార్టీకి తీరని లోటు కనిపించిందని అన్నారు.మృతుని కుటుంబానికి సిపిఐ ఎల్లప్పుడు అండంగా ఉంటుందని కుటుంబ సభ్యులు ఎవరు అధైర్య పడవద్దు అని స్పష్టం చేశారు. మండలంలో సిపిఐ అభివృద్ధికి రైతుల సమ స్యల కోసం ఎల్లవేళల అందుబాటు ఉండి పోరాడిన నాయకుడని కొనియా డారు. ప్రజలతో స్నేహశీలిగా రైతు బాంధవుడిగా మెలిగాడని మచ్చలేని నాయకుడిగా ఎదిగాడని అన్నారు.సంబంధిత అధికారులు మృతుని కుటుం బానికి ఆర్థిక సహాయం అందించాలని వితంతు పెన్షన్ మంజూరు చేయా లని ఇంటి పట్టా వైయస్సార్ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్లవేళలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశారని అన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి కాలప్పాచారి సిపిఐ మండల సహాయ కార్యదర్శికె.రంగన్న సిపిఐ నాయకులు మస్తాన్ నూరల్లా మౌనేశా చారి సిరిగేరి కృష్ణ పాల్గొన్నారు. సిద్ధప్ప గౌడ్ కుటుంబానికి ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉండి పరిష్కరించడానికి ముందుంటామని పేర్కొన్నారు.

కోల్స్ తెలుగు బాప్టిస్టు మందిర ప్రతిష్ఠ కార్యక్రమం

విశాలాంధ్ర - కర్నూలు : పట్టణంలోని పెద్దపాడు రోడ్డు రాజీవ్ గృహ కల్ప కాలనీలో మందిర పతిష్ఠ కార్యక్రమం స్థానిక సంఘ కాపరి రవికుమార్, స్థానిక సంఘస్థులు, ఆనంద్ గిచర శ్రీకాంత్, దస్తగిరి, రాము, యోహాను ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా సిని చర్చి కమీటీ సభ్యులు పాల్గొన్నారు. రెవ.పాస్కల్ ప్రకాష్, దైవసందేశం అందిచారు, విశిష్ఠ అతిథులుగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్‌సిద్దారెడ్డి, రేణుక,ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా గురుభక్తి వైభోత్సవాలు

విశాలాంధ్ర - మంత్రాలయం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి గురుభక్తి వైభత్సవాల్లో భాగంగా బుధవారం రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. గురుభక్తి వైభోత్సవాలలో భాగంగా మఠం ప్రస్తుత పీఠాధిపతి సుబుతేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు .అనంతరం మఠం ప్రాంగణంలో స్వర్ణ రథోత్సవం పై ప్రహల్లాదరాయుల విగ్రహాన్ని ఉంచి బృందావనం చుట్టూ భక్తుల మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి సన్నిధిలో ప్రముఖులు ప్రస్తుత పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా ఢిల్లీ జడ్జి వెంకటరమణి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వీరికి మఠం అధికారులు ఆయా శాఖ అధికారులు స్వాగతం పలికారు వీరు మొదటగా గ్రామ దేవత మాంచాలమును దర్శించుకుని తదనంతరం రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం రథోత్సవంలో పాల్గొన్నారు. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి గురుభక్తి వైభవ్వవంలో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు భరతనాట్యం కచేరి సంగీతం వంటి సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు ఇవి భక్తులను ఎంతోగానో ఆకట్టుకున్నాయి వీరికి మఠం ప్రస్తుత పీఠాధిపతి సుబుతేంద్ర తీర్థులు శేష వస్త్ర ఫల పుష్ప మంత్రాక్షల ఇచ్చి ఆశీర్వదించారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్‌కి తరలి వెళ్లిన నాయకులు

విశాలాంధ్ర - కర్నూలు : మార్చిలో జరగబోయే పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పిడిఎఫ్ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి పోతుల నాగరాజుల నామినేషన్ కార్యక్రమానికి సీపీఐ ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. బుధవారం అనంతపురం నగరంలో జరిగిన నామినేషన్ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామ చంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్నాథం, రామకృష్ణారెడ్డి, నబి రసూల్, పంపన్న గౌడ్, చంద్రశేఖర్, రంగన్న,వీరుపాక్షి, కారుమంచి, డిహెచ్పిఎస్ నాయకులు గురుదాస్, తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, జిల్లా ఉపాధ్యక్షులుశరత్‌కుమార్,అల్తాఫ్,సహాయ కార్యదర్శులు సాబీర్ భాష, విజయేంద్ర, రంగస్వామి, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్న, ఏఐటియుసి నగర అధ్యక్షులు వెంకటేష్, డిప్యూటీ సెక్రటరీ రామాంజనేయులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ, భవన నిర్మాణ సంఘం నాయకురాలు రేణుక, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష,కార్యదర్శులు వెంకటేష్,మునిస్వామి తరలి వెళ్ళారు.

విశాలాంధ్ర -హొళగుంద : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ వామపక్షాల అభ్యర్థి ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతుల నాగరాజు బుధవారం అనంతపురంలో నామినేషన్ వేస్తున్న సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు శ్రీరంగా, సతీష్ కుమార్ ,కబీర్ సాబ్ ,వెంకటేష్ ,నాగరాజ్,పోతురాజు, కలందర్ అధిక సంఖ్యలో వాహనాలలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు శ్రీరంగ మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతులనాగరాజును ఓటర్లు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైకాపా ప్రభుత్వంలో నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిందని ఉపాధ్యాయులకు పని ఒత్తిడితో పాటు ముఖాహాజరి జీతాలు నెలకు సక్రమంగా అందక సమస్యలతో కొట్టి మిటాడుతున్నారని ఆరోపించారు.వామపక్షాల అభ్యర్థుల తరఫున అధిక ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను అభ్యర్థిస్తామని అన్నారు. విద్యావంతులు మేధావులు ఉపాధ్యాయులు కార్మిక కర్షక సంఘాల నాయకులు ప్రజలు వామపక్షాల అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

విశాలాంధ్ర - వెల్దుర్తి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించుకున్నందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. స్థానిక వెల్దుర్తి పట్టణంలోని అమెజాన్ ఫంక్షన్ హాల్ లో బుధవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వార్డ్ మెంబర్లుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటర్లు చైతన్యం చేసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసే విధంగా ప్రచారం నిర్వహించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బొమ్మన సరళ రవి రెడ్డి ,సర్పంచ్ ముత్యాల శైలజ ,మాజీ జెడ్పిటిసి సచివాలయ మండల కన్వీనర్ దేశాయి సమీర్ కుమార్ రెడ్డి, పత్తికొండ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్, రామలకోట రాధాకృష్ణారెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పరమేశ్వరి ఆలయంలో హుండీ లెక్కింపు

విశాలాంధ్ర- గూడూరు : గూడూరు మండలం కె. నాగలాపురం గ్రామంలో వెలిసిన శ్రీ సుంకుల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు ఆలయ ఈవో దినేష్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపును నిర్వహించారు. మొదటి రోజు హుండీ లెక్కింపులో 25, 14,891రూ. ఆదాయం వచ్చినట్లుగా ఆలయ ఈవో దినేష్ తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో కె.నాగలాపురం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సోమ్లా నాయక్, బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. హుండీ లెక్కింపులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసు సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టారు.

రాష్ట్రాభివృద్ధికి జర్నలిస్టులే కీలక పాత్ర

విశాలాంధ్ర - నంద్యాల : రాష్ట్ర అభివృద్ధికి జర్నలిస్టుల పాత్ర కీలకమని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాల సెమినార్ హాలులో జర్నలిస్ట్ డిపార్ట్మెంట్ కోర్సు, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్‌లో సర్టిఫికేట్ కోర్సు కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ పీజీ కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ దస్తగిరి రెడ్డి, ప్రెస్ అకాడమీ సెక్రెటరీ బాలగంగాధర తిలక్, రామకృష్ణ డిగ్రీ కాలేజ్ ప్రతినిధి ప్రగతి, సీనియర్ జర్నలిస్టులు జనార్దన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ జర్నలిజం అనేది ప్రజలతో మమేకమై అనేక సవాళ్లను ఎదుర్కొని అన్ని రంగాలకు సంబంధించిన వార్తలను సేకరించి ప్రచురించాల్సి ఉంటుందన్నారు. పరిశోధనాత్మక జర్నలిజం బాధ్యతగా ఉండాలే కానీ లేని పక్షంలో సమాజానికి అనర్థం తెస్తుందన్నారు. అందుకే ఐదు మౌలిక సూత్రాలను ప్రముఖ పాత్రికేయులు ప్రతిపాదించారు. దీనికి ముందు ప్రతి వార్తలో ఉండవలసిన మరో ఐదు అంశాలు ఏమిటంటే ఏ వార్తకు అయినా ఎప్పుడు, ఎక్కడ, ఏమిటి? ఎలా? ఎందుకు ? అన్న ప్రశ్నలకు సమాధానం ఇచ్చేలా వుంటేనే సమగ్రమైన వార్తగా పరిగణించగలుగుతామన్నారు. జర్నలిజం ప్రస్తుతం అనేక ఆటుపోట్లను ఎదుర్కుం టోందన్నారు. ఇది ఒక ఇండియాకే పరిమితం కాలేదని, ప్రపంచం అంతటా ఈ సమస్య ఉందన్నారు. జర్నలిజంలో ఎన్నో రంగాలున్నాయని, పొలిటికల్ జర్నలిజం, జనరల్ జర్నలిజం, క్రైమ్ వార్తల జర్నలిజం, పరిశోధనాత్మక జర్నలిజం, స్పోర్ట్స్ జర్నలిజం, బిజినెస్ జర్నలిజం, మెడికల్ జర్నలిజం, పబ్లిక్ రిలేషన్స్ జర్నలిజం, ప్రతి రంగానికి సంబంధించి మెగజైన్లు వస్తున్నాయన్నారు. ముందుగా భాషపై పట్టు సాధించి,ఏదైనా కథనం రాస్తే అది చదివేవారిని కదలించేలా ఉండాలన్నారు. మన దేశ మాజీ ప్రధాని పివి నరసింహారావు పద్నాలుగు భాషలు నేర్చుకుని పేరు గాంచారన్నారు. ఏ రంగంలో అయినా భాషా ప్రావీణ్యం అవసరమన్నారు. ప్రత్యేకించి తెలుగు తో పాటు ఆంగ్లం, హిందీ భాషలలో రాయడం, మాట్లాడడం. నేర్చుకోగలిగితే ఎంతో భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు హితవు చెప్పారు. ఇది కేవలం జర్నలిజం రంగంలోనే కాదు. ఇతర రంగాలలో కూడా ఉపయోగ పడుతుందన్నారు. ఇటీవల ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా, డిజిటల్ మీడియా కూడా విస్తారంగా ప్రచారంలోకి వచ్చాయన్నారు.

కొన్నిసార్లు మెయిన్ మీడియా ఇవ్వని వార్తలు, సోషల్ మీడియా, డిజిటల్ మీడియాలో వచ్చేస్తున్నాయి. ఒకప్పుడు వార్త తెలుసుకోవడానికి 24 గంటలు పట్టేదని, ఇప్పుడు నిమిషం పట్టడం లేదన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అంతగా అభివృద్ధి చెందిందన్నారు. ప్రెస్ అకాడమీ సెక్రెటరీ బాలగంగాధర తిలక్ మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టుకు ప్రశ్నించే తత్వంతో పాటు కొత్త విషయాలు తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉండాలన్నారు. రామకృష్ణ పీజీ కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉన్నతమైన వ్యక్తులుగా ఎదగడానికి జర్నలిజం కోర్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మొద టి విడత బ్యాచ్‌లో 40మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. జర్నలిజంతో పాటు మాస్ మీడియా కమ్యూనికేషన్ కూడా ప్రారంభిం చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర - ఆలూరు : ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలకు అత్యధికంగా కేబినెట్‌తోపాటు రాజ్యసభ, శాసనమండలి వివిధ కార్పొరేషన్లు, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పిం చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు.

బుధవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ 75సంవత్సరాల దేశ చరిత్రలో ఏ ముఖ్య మంత్రికి సాధ్యపడని సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధి జగన్ కే సాధ్య మైందన్నారు. ఖాళీగా ఏర్పడిన 18 శాసన మండలిలో ఎస్సీ ఎస్టీలకు మూడు, బీసీలకు 11 కేటాయించడం జరిగిందని, చంద్రబాబు తన ప్రభుత్వంలో బీసీలకు పెద్ద పీట వేసామని చెప్పడం చాలా సిగ్గుచేటు అన్నారు. తన స్వార్థం కోసం పాదయాత్ర చేపట్టిన పప్పు లోకేష్ కి మాట్లాడే అర్హత లేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఏక వచనం తో సంబోధిస్తూ పదేపదే విమర్శిస్తే ఖబర్దార్ అంటూ హెచ్చరించారు.వాల్మీకులంతామ 2024 లో సిఎం జగన్ వెన్నంటు ఉంటూ గెలిపించేందు కు కృషి చేస్తామ న్నారు. రాష్ట్రంలో కురువ, యాద వ్, ఇలా అన్ని కులాలకు సముచిత స్థానం కల్పించారు. చివరి రక్తం ఉన్నంత వరకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెంటే ఉంటామన్నారు. 2024 ఎన్నికల్లో 175 స్థానాలు గెలవడం గెలవడం పద్యం అని జోష్యం చెప్పారు. మంత్రి సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు వైస్ ఎంపీపీ శ్రీరాములు, మండల కన్వీనర్ వీరేష్, ఎంపీపీ తనయుడు వీరేష్, వైస్ ఎంపీపీ భర్త శ్రీధర్, వైస్సార్సీపీ నాయకులు ఆర్కే, దీపక్, గిరి, రామచంద్ర, నబీ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు : ఆర్యవైశ్యులకు ఎక్కడ ఇబ్బందులు కలిగినా వారికి అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ స్పష్టం చేశారు. కర్నూల్ నగరంలోని హొటల్ మోర్యా ఇన్ కాంప్లెక్స్‌లో ఉన్న విబు పరిణయ ఫంక్షన్ హాల్లో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ఆయన సతీమణి శ్రీమతి టీజీ రాజ్యలక్ష్మిల 50వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా అవపా ఆధ్వ ర్యంలో రాయలసీమ ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ దంపతుల 50వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ కుటుంభ సభ్యులతో పాటు అవోపా వ్యవస్థాపక అధ్యక్షులు పువ్వాడ చంద్రశేఖర్, ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు పెనుగొండ సుబ్బరాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త టిజి శివరాజ్, అవోపా రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మల,జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఏ వి ఆర్ సుబ్రహ్మణ్యం, కర్నూలు అధ్యక్షుడు యుగంధర్ శెట్టి, వధూవరుల పరిచయ వేదిక కన్వీనర్ జవహర్ బాబు పాల్గొన్నారు.

జొన్నలు కొనడానికి కార్పొరేషన్ సిద్ధం

విశాలాంధ్ర - ఆదోని : డివిజన్లోని రైతుల దగ్గర నుండి జొన్నలు కొనుగోలు చేయడానికి పౌరసరఫరాల కార్పొరేషన్ సిద్ధంగా ఉన్నదని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బుధవారం తెలిపారు. మార్కెట్ ధర రూ. 2,700 ఉండగా పౌరసరఫరాల కార్పొరేషన్ రూ. 2,970 ధర వరకు కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందాన్నారు. జొన్నలను అమ్మకాలు చేసిన రైతులకు అక్కడే నగదు డబ్బును ఇవ్వడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు అయా గ్రామ విఆర్‌ఓలను సంప్రదించాలని తెలిపారు

లా నేస్తం పథకం బ్యాంకు ఖాతాలో జమ

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు : జిల్లాలో వైఎస్ఆర్ లా నేస్తం పథకం ద్వారా105 మంది జూనియర్ లాయర్లకు రూ.5,25,000 బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్. ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ లా నేస్తం పథకాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా 2,011 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదుల ఖాతాల్లో రూ.1,00, 55,000ను క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి విడుదల చేశారు .ఈ కార్యక్రమంలో కర్నూలు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సోషల్ వెల్ఫేర్ డిడి ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి,బీసీ కార్పొరేషన్ ఈడీ నాగేశ్వరరావు,జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోషల్ వెల్ఫేర్ డిడి మాట్లాడుతూ వైఎస్ఆర్ లా నేస్తం పథకం కింద లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువ లాయర్లు వృత్తిలో నిలదొక్కుకునేందుకు నెలకు రూ.5వేల చొప్పున మూడు సంవత్సరాల పాటు ప్రభుత్వం స్టైఫండ్ అందించడం జరుగుతోందని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ఈడి నాగేశ్వరరావు, ఏపీఎంఐపి పిడి ఉమాదేవి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి సబహ్ పర్వీన్, డిఎల్డిఓ బాలకృష్ణారెడ్డి,జూనియర్ లాయర్లు పాల్గొన్నారు.

అంతర్ పంటగా గంజాయి సాగు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి : మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలో మిర్చి పంటలో అంతర్ పంటగా గంజాయి సాగు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం గుర్తు తెలియని వ్యక్తి నుండి రాబ డిన సమాచారం మేరకు సేబు కోడుమూరు సిఐ శ్యామ్ ప్రసాద్, తహసిల్దార్ పురుషోత్తం,వీఆర్వో ప్రసాద్, పోలీసు సిబ్బంది గ్రామానికి వెళ్లి విచారించగా గ్రామానికి సమీపంలో ఉన్న మిద్దె పెద్దలాలు పొలంలో సర్వేనెంబర్ 734- 2లో 80సెంట్లు మిరప పంటను సాగు చేశాడు అందులో పరిశీలించగా అంతర్ పంటగా 83 గంజాయి మొక్కలను నాటాడు ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టుచప్పుడుగా లావాదేవీలు కొనసాగిస్తున్నారన్నారు. గంజాయి మొక్కల పీకించి వాటిని స్వాధీనం చేసుకుని పెద్దలాలను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. విషయం తెలుసుకున్న పత్తికొండ డిఎస్పి శ్రీనివాసులు క్రిష్ణగిరి పోలీస్‌స్టేషన్‌కి వచ్చి విచారణ చేపట్టాడు పూర్తి సమాచారం నిమిత్తమై వెల్దుర్తి సీఐ యుగంధర్ కు ఆదేశాలు ఇచ్చి నట్లు ఆయన తెలిపారు. అరెస్ట్ అయిన వ్యక్తిని డోన్ కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ కు ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు

విశాలాంధ్ర వెల్దుర్తి : పట్టణ సమీపంలోని అయ్యప్ప స్వామి గుడి సమీపాన ఉన్న సపోటా తోటలో గుర్తుతెలియని వ్యక్తులు మంటలు పెట్టడంతో అక్కడ ఉన్న రిపోర్టర్స్ మధు చిన్న హరి లాయర్ సుధీర్, మంటను ఆర్పి ప్రయత్నం చేశారు డోన్ ఫైర్ అధికారులకు ఫోన్ చేయడంతో వాళ్ల వాహనం వచ్చి అధికారులు మంటలను ఆర్పేశారు.